ఖర్చు చేసుకుని జమాఖర్చు వ్రాసి ఇట్టే పెట్టమని చెప్పారట. సరే, ఆయన ఖర్చుచేశాడు, లెక్క వ్రాశాడు. దేవేంద్రనాథుడొకరోజున ఆ లెక్క తణిఖీచేశారట. అందులో ఇచ్చిన సొమ్ములో ఖర్చుచేసిన సొమ్ము తీసివెయ్యగా మిగిలిన శేషం అసలు ఇచ్చిన దానికంటె హెచ్చుగా వుందట. మహర్షి నవ్వి "బ్యాంకుల్లో దాచడంకన్న డబ్బు నీచేతికిస్తె దబ్బున పెరుగుతుందల్లే వుందే" అని ఎగతాళి చేశారట.

గాంధీజీ విషయం వినండి. ఆయనకు చిన్నతనంలో స్వయంగా లెక్కలుచేసే తెలివి తేటలూ లేవట. ఎదుటివాడి పలకలోనుంచి నకలుతీసే నైపుణ్యమూ లేదట. ఒకమాటు వాళ్ళ స్కూలుకి ఇన్‌స్పెక్టర్ వచ్చినప్పుడు తోటిపిల్లలంతా ఏదో ఒకవిధంగా ఆన్సర్స్‌వేసి చూపెడితే, ఈయన ఒక్కడూ కాకుల్లో కోకిలలాగ చేతకాక నిలబడ్డాడుట. ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోయాక వాళ్ళ మాస్టరు దగ్గఱకు పిలిచి "లెక్క చెయ్యలేకపోతే పోనీ—ప్రక్కవాడి పలకలోనుంచైనా ఎక్కించవద్దా?" అని లెంపకాయ కొట్టాడట.

కాబట్టి లెక్కలురావని బెంగపడటం పురుష లక్షణం కాదు. అసలు లెక్కలు చేతకావడమే పురుష లక్షణంకాదు. ధనుర్మాసంలో తెల్లవారేటప్పటికల్లా వీధిలో సాక్షాత్కరించే టటువంటి ఆ చుక్కలూ, ఆ ముగ్గులూ మనకు చేతకాకపోతే ఫరవాలేదు. ఎవరో చెప్పినట్టు ఈ లెక్కల రాయుళ్ళంతా క్రిందటి జన్మంలో ఆడవాళ్ళయి అందులో ఆర్య హిందూమహిళలై వుంటారు. ఆ పూర్వజన్మ వాసనచేతనే ఇంకా కాగితాలమీద ముగ్గులు గిలుగుతూ వుంటారు. లేకుంటే వచ్చే జన్మంలోనైనా వీళ్ళు రవికలు తొడుగుకోక తప్పదు.


ఇళ్లన్నీ కేవలం
టి. టి. ఇంగువమయం
సైన్సుపికై
టి. టి
మిక్సకి యింగువ


# ఇంతా చేస్తే!

"కాశీపట్నం"

యావదాంధ్ర విఖ్యాత రచయిత—యే పదివ ఏటనో పుస్తకం పట్టాడు. రాత్రీ పగలూ చదివాడు. క్లాసు పుస్తకాలు సంగతి మరిచిపొయ్యేవాడు.

ఇంట్లో తండ్రిచేత బయట మాస్టరుగారుచేత తిట్లు సహించాడు విద్యార్థి జీవితమల్లా.

ఇంట్లో భార్యనుంచీ బయట అధికార్లనుంచీ సణుగుడు సహించాడు యవ్వన జీవితమల్లా.

సాధనకు తనయెత్తు కాగితాలు వ్రాశాడు. వీధిపోయే ప్రతి మనిషినీ, వినపడ్డ ప్రతి పలుకునీ, అగపడ్డ ప్రతి దృశ్యాన్నీ, మాట్లాడే ప్రతి హృదయాన్నీ, విమర్శించి, జీర్ణించుకున్నాడు. యెంతో విలువైన ఎనర్జీని నిర్లక్ష్యంగా త్యాగంచేసిన మానవ హృదయాలను అర్థంచేసుకొనే కళ కిసంపాదించాడు.

ఉత్కృష్ట మనదగ్గ గ్రంథం వ్రాశాడు.

దగ్గర దగ్గర పదహారు వందలకోట్ల మానవులలో, రెండుకోట్ల అరవైనాలుగు లక్షలే అయిన ఆంధ్రులలో, పదహారు లక్షల అక్షరాస్యులలో, పుస్తకాలు చదివే అవకాశమున్న లక్షమందిలో యాభైవేల మంది చదివారు ఆ పుస్తకాన్ని.

పదహారుకోట్లమంది జనసంఖ్యలో ఎన్నవవంతు? మూడులక్షల ఇరవై వేలమంది మనుష్యులకు ఒక్కడి వంతుననీ పుస్తకం అందుకున్నారు.

కాని అంత గొప్ప పుస్తకాన్ని అందరూ ఆనందించలేరు.

రవీంద్రుడి పశ్చాత్తాపం బోరింగ్ గా వుందన్న నవలా పాఠకుణ్ణే నెరుగుదును. ఆయన చదివేది రైల్వే సారస్వతం.

అంచనాకు వెయ్యిమంది ఆనందించగలరేమో. ఆ పుస్తకాన్ని.

వారైనా వారి జీవితం నూరేండ్లలో ఆ పుస్తకం చదివిన రెండు మూడు గంటలు మాత్రం కరిగి చలించి రచయితను మెచ్చుకోగలుగుతారు.

జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఒక సెకన్ వేసుకున్నా జీవితమంతటా యింకో గంట వేసుకోవచ్చు. మొత్తం నాలుగు గంటలు.

జీవితమల్లా ఎంతో త్యాగంచేసి కష్టపడి సాధన చేసి చేసి వ్రాసిన రచన—

ప్రపంచంలో—కష్టంమీద కోటిన్నొకణ్ణి రెండు లక్షల గంటలకు ఒకగంట మాత్రం చలింప చెయ్యగలుగుతుందట!